క్లుప్తంగా

సింగరేణి క్వార్టర్ ఇప్పించండి..



వినతిపత్రం అందజేస్తున్న దివ్యాంగులు

ఇల్లెందు: సమాజంలో నిరాదరణకు గురవుతున్న దివ్యాంగులు చైతన్యవంతులుగా ఎదిగేందుకు, నిత్యం ఒకచోట సమావేశమయ్యేందుకు కార్యాలయం అవసరమని దివ్యాంగ హక్కుల జాతీయ వేదిక సభ్యులు కోరారు. ఆదివారం ఎమ్మెల్యే హరిప్రియను తన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఇల్లెందులో సింగరేణిలో ఖాళీగా ఉన్న ఓ క్వార్టర్‌ను తమకు ఆఫీస్ కోసం ఇప్పించమని విన్నవించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ప్రవీణ్, ఈశ్వర్, రాజేందర్ ఉన్నారు.

బీమా చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న జీఎం జాన్ ఆనంద్

ఇల్లెందు: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో శాలరీ అకౌంట్ ఉన్న సింగరేణి ఉద్యోగులకు ఉచిత ప్రమాద బీమా వర్తిస్తుంది. ఈ మేరకు కొప్పుల నగేష్ ఇటీవల మృతి చెందాడు. ఆదివారం ఇల్లెందులో మృతుడి కుటుంబానికి ఏరియా జీఎం జాన్ ఆనంద్ చేతుల మీదుగా రూ.52 లక్షల చెక్కును అందజేశారు.

సింగరేణి అధికారులు ఎస్‌ఓటూ జీఎం మల్లారపు మల్లయ్య, ఎస్‌బీఐ మేనేజర్ ప్రధాన్, సింగరేణి అధికారులు ప్రభాకర్‌రావు, వెంకటరామచంద్ర, అంజిరెడ్డి, నాగేశ్వరరావు, టీజీబీకేఎస్ ఉపాధ్యక్షుడు రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

అద్దె బస్సు కార్మికుల సమ్మె విరమణ



మాట్లాడుతున్న అద్దె బస్సుల డ్రైవర్లు

చుంచుపల్లి: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రెండు రోజులుగా సమ్మె చేస్తున్న అద్దె బస్సుల కార్మికులు ఆదివారం రాత్రి సమ్మె విరమించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో అద్దె బస్సుల యజమానులతో జరిపిన చర్చలు సఫలం కావడంతో సమ్మె విరమిస్తున్నట్లు ప్రకటించారు. డ్రైవర్లు మాట్లాడుతూ.. ఆర్టీసీ అద్దె బస్సుల యజమానులు డ్రైవర్లు, హెల్పర్లకు తగిన వేతనాలు చెల్లిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. అదేవిధంగా పలు డిమాండ్ల విషయంలో సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు. ఆర్టీసీ అద్దె బస్సుల కార్మికులకు అన్ని విషయాల్లో అండగా ఉంటామని హామీ ఇవ్వడంతో సమ్మెను విరమిస్తున్నట్లు పేర్కొన్నారు. సమ్మెకు సహకరించిన సీఐటీయూ ఇతర కార్మిక సంఘాల నాయకులకు అద్దె బస్సుల కార్మికులు కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం నుంచి కొత్తగూడెం డిపో పరిధిలోని 32 అద్దె బస్సులు యథావిధిగా తిరగనున్నాయి. రెండు రోజుల సమ్మె మూలంగా కొత్తగూడెం డిపోకు సుమారు రూ.10 లక్షల వరకు నష్టం వాటిల్లిందని ఆర్టీసీ అధికారులు తెలిపారు.

మంకీ ఫుడ్ కోర్టుల పెంపకం

- కోతులను పల్లెలకు దూరం చేయడమే లక్ష్యం
- ఇల్లెందు రేంజ్‌లో అటవీశాఖ వినూత్న ప్రయోగం
- అడవిలో పండ్ల మొక్కల పెంపకం



పండ్ల మొక్కలు నాటుతున్న అటవీశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు

ఇల్లెందురూరల్: కోతుల చర్యలు ప్రాణాంతకంగా మారడంతో జనం బెంబేలెత్తిపోతున్నారు. అటవీ సంపద అంతరించిపోవడంతో ఆహారం కోసం అవి జనావాసాల్లోకి వస్తున్నాయి. ప్రజలపై దాడులకు పాల్పడుతూ ప్రాణాలు తీస్తున్నాయి. పరిష్కారం దొరకక జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మనుషులకు భయపడే స్థాయి నుంచి భయపెట్టి దాడి చేసే స్థాయికి వచ్చాయి. ఈ పరిస్థితిలో అటవీశాఖ ఇల్లెందు రేంజ్ అధికారులు ఓ సరికొత్త కార్యచరణకు శ్రీకారం చుట్టారు. తిరిగి అడవులకు పంపించే లక్ష్యంతో ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నారు. అడవుల్లోనే వానరాల ఆకలి తీర్చేలా ప్రత్యేకంగా మంకీ ఫుడ్ కోర్టులను ఏర్పాటు చేస్తున్నారు.

హైవేపై నిత్యం ప్రమాదాలు...

పల్లెల్లో కుప్పలు తెప్పలుగా ఉండే వానరాలు ప్రజలు అప్రమత్తమవడంతో సరైన ఆహారం లభించక అల్లాడుతున్నాయి. ఈ క్రమంలో రహదారుల పైన పడే తిండి గింజలకు, వాహనదారులు వేసే ఆహార పదార్థాల కోసం వేచిచూస్తున్నాయి. ఇల్లెందు – కొత్తగూడెం జాతీయ రహదారిలో ఇల్లెందు నుంచి టేకులపల్లి మండలం తొమ్మిదోమైలు తండా వరకు రహదారి పొడవునా కోతుల సందడి కనిపిస్తుంది. తిండి కోసం చేసే ప్రయాసలో ప్రమాదాల్లో మృత్యువాత పడుతున్నాయి. అంతేకాకుండా తిండి కోసం బైక్‌ల వెంట అవి పరుగెడుతూ వాహనదారుల ప్రమాదాలకూ కారణమవుతున్నాయి. ఇలాంటి ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి.

ఫలితమివ్వని వానర ఆహార ప్రాంగణాలు...

వానరాల ఆహారం కోసం ఎవరూ ఆలోచన చేయలేదు. వాటి ఆకలిని చూసి ప్రభుత్వం ఆరో విడత హరితహారంలో 'వానరాల ఆహార ప్రాంగణం'లను ఏర్పాటుకు ప్రణాళిక చేశారు. ఇలా ఇల్లెందు నియోజకవర్గ పరిధిలో టేకులపల్లి మండలం తొమ్మిదోమైలు తండా సమీపంలో 2020 ఆగస్టులో వానర ఆహార ప్రాంగణాన్ని ఏర్పాటు చేశారు. అక్కడ వివిధ రకాల పండ్ల మొక్కలు విరివిగా నాటారు. కానీ వాటి సంరక్షణను పట్టించుకోకపోవడంతో ఆదిలో బెడిసికొట్టింది. దీంతో మరింత జాగ్రత్తగా తాజాగా అడవిలోనే పండ్ల మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

ఆహారం లభ్యమయ్యేలా.. ఆడుకునేలా..

హరితహారం పథకం ప్రారంభం నుంచి అటవీశాఖ అడవుల పునరుద్ధరణ పనులను ప్రతిఏటా చేపడుతోంది. ఫలాలు, కలప ఉపయోగపడేలా మొక్కలు పెరిగేందుకు కొంత ఆలస్యం అవుతుంది. నాటిన ఏడాదిలోనే కొంత మేరైనా ఎదిగేలా మామూలు రకాల చెట్లను అత్యధికంగా అడవుల్లో నాటేందుకు అటవీశాఖ అధికారులు గత కొన్నేళ్లుగా ప్రాధాన్యమిస్తూ వస్తున్నారు. కోతులు, ఇతర వన్యప్రాణులకు సైతం ఆహారం దొరక్క పల్లెల బాటపడుతున్నాయి. ఇందులో అగ్రస్థానం వానరాలది.. ఈ సమస్యను గుర్తించిన అటవీశాఖ అధికారులు వానరాలను తిరిగి వనంలోకి రప్పించేందుకు ప్రయోగాత్మకంగా ఇల్లెందు రేంజ్ పరిధిలో ప్రత్యేకంగా ప్రస్తుత సీజన్‌లో 28 హెక్టార్లలో పండ్ల మొక్కలు నాటేందుకు నిర్ణయించారు. ఇందులో భాగంగా కోతులు అత్యధికంగా రహదారులపై సంచరిస్తున్న ఇల్లెందు–కొత్తగూడెం జాతీయ రహదారిలో బొజ్జాయిగూడెం సమ్మక్క గద్దెల సమీపంలో పండ్ల మొక్కలు నాటేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. జాతీయ రహదారికి ఇరువైపులా వంద మీటర్ల దూరంలో ఒక పండ్ల మొక్కల ప్లాంటేషన్, మరో 50 మీటర్ల దూరంలో మరో పండ్ల మొక్కల ప్లాంటేషన్ లక్ష్యంగా పనులు ప్రారంభించారు. ఇందులో చిన్నచింత, నేరేడు, ఉసిరి, సీతాఫలం, వెలగ, చింత, సీమచింత, ఇప్ప వంటి రకాల పండ్ల మొక్కలను నాటుతున్నారు. రెండు ప్లాంటేషన్ల మధ్యలో వానరాలు ఆడుకునేలా హార్డ్ కోర్ మొక్కలు నాటుతున్నారు. ఇదే తరహాలో ప్రతిఏటా పండ్ల మొక్కల ప్లాంటేషన్లను విస్తరించేందుకు ఇల్లెందు రేంజ్ అధికారులు నిర్ణయించడం అభినందనీయం.



బావాజీనగర్ గ్రామంలో కోతుల సంచారం

సంరక్షణ కీలకం.. ఏటా అటవీ ప్రాంతంలో మొక్కలు నాటుతున్నా.. కొన్ని చెట్లు ధ్వంసమవుతున్నాయి. ప్రస్తుతం ప్రణాళికతో నాటుతున్న పండ్ల మొక్కల పెంపకం పర్యవేక్షణే కీలకం. ఆయా మొక్కలకు నీటిని సకాలంలో అందించడం, ఎరువులు వేయడం, పాదులు చేయడం వంటివి పండ్ల మొక్కలకు తప్పనసరిగా చేయాల్సిన పనులు. ఆ దిశగా సంబంధిత అధికారులు నిరంతర పర్యవేక్షణ చేపడితే లక్ష్యాన్ని చేరుకోగలుగుతారు.

ఎంతో మందికి గాయాలు



అడవుల్లో ఆహారం దొరకక వానరాలు జనావాసాల్లోకి వస్తున్నాయి. ఇల్లెందు–కొత్తగూడెం జాతీయ రహదారిపై వీటి సంఖ్య వందల్లో ఉంటోంది. తిండి కోసం వచ్చిపోయే వాహనాల వెంట పడుతూ వాహన చోదకుల ప్రమాదాలకు కారణమవుతున్నాయి. వానరాలు తిరిగి అడవిలోకి వెళ్లేలా అటవీశాఖ పండ్ల మొక్కలు పెంచడం బావుంది.

– మెట్టెల శిరోమణి, ఎంపీటీసీ, బొజ్జాయిగూడెం

కోతులు అడవికి చేరుకునేలా..



కోతులు అడవుల్లోనే ఉండేలా పండ్ల మొక్కలు పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రస్తుతం ప్రయోగాత్మకంగా బొజ్జాయిగూడెం సమ్మక్క గద్దెల సమీపంలో జాతీయ రహదారికి ఇరువైపులా పండ్ల మొక్కలు నాటుతున్నాం. వానరాలకు ఆహారం అందడంతోపాటు అవి ఆడుకునేందుకు అవసరమైన మొక్కలు పెంచేలా ప్రణాళిక రూపొందించాం.

– నాగేశ్వరరావు, ఎఫ్‌ఆర్‌ఓ, ఇల్లెందు రేంజ్

అమ్మవారికి ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న మహిళలు

సుజాతనగర్: ఆషాఢమాసం సందర్భంగా ఆర్య వైశ్య భక్త మహిళల ఆధ్వర్యంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారికి ఆదివారం ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి చీరసార సమర్పించారు. తొలుత సోమేశ్వర స్వామి దేవస్థానంలోని పరమేశ్వరీ అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం అక్కడి నుంచి మేళతాళాలతో ఊరేగింపుగా గ్రామంలోని ఆయా దేవతలను దర్శించుకుని చెన్నకేశవ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో అన్నవరపు పూర్ణచంద్రరావు, చారుగుండ్ల దేవి ప్రసాద్, దూపకుంట్ల సునీల్ కుమార్, భక్త మహిళలు వందనపు భాగ్యలక్ష్మి, కంచర్ల శ్రీలత, మిరియాల జ్యోతి, కుక్కడపు పద్మావతి, దుర్గారాణి, మంజుల పాల్గొన్నారు.

సింగరేణిలో అన్ని కమిటీలను రద్దు చేయండి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో గుర్తింపు సంఘం కాలపరిమితి అయిపోయినా గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలకు యాజమాన్యం ప్రియారిటీ ఇస్తోందని, ఇది సరైంది కాదని హెచ్‌ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. డీవైసీఎల్సీ గైడ్ లైన్స్ అమలు చేయకపోతే హ్యూమన్ రైట్స్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. సింగరేణిలో ఉన్న పాత కమిటీలు, సేఫ్టీ కమిటీ, పిట్ కమిటీతో పాటు ఇతర అన్ని రకాల కమిటీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రతి కార్యక్రమాన్ని ఏ ఏరియాలో నిర్వహిస్తారో ఆయా కార్మిక సంఘాల నాయకులకు పిలవాలని డిమాండ్ చేశారు. లేదంటే అన్ని సంఘాలను కలుపుకొని బొగ్గు ఉత్పత్తిని స్తంభింపజేస్తామని హెచ్చరించారు.

అదేవిధంగా గనులు, డిపార్ట్‌మెంట్ల వద్ద డిప్యూటేషన్ దందా పెరిగిందని వాటిని రద్దు చేయాలని, అనారోగ్యం ఉన్న కార్మికుల స్థానంలో నిన్న, మొన్న విధుల్లో చేరిన బదిలీ వర్కర్లను నియమించి వేలాది రూపాయలను దండుకుంటున్నారని, కొంతమంది అధికారుల పాత్ర ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ విధానానికి స్వస్తి పలకాలని హెచ్చరించారు.

పార్లమెంట్ కమిటీ ఉపాధ్యక్షుడిగా రామయ్య

జూలూరుపాడు: టీడీపీ ఖమ్మం పార్లమెంట్ కమిటీ ఉపాధ్యక్షుడిగా వైరా నియోజకవర్గం ఏన్కూరు మండలం ఒంటిగుడిసెకు చెందిన అరెం రామయ్య నియమితులయ్యారు. పాపకొల్లు గ్రామానికి చెందిన రోకటి లక్ష్మీనరసింహారావు కార్యనిర్వాహక కార్యదర్శిగా నియమించారు. ఈ మేరకు పార్టీ అధిష్టానం నుంచి ఆదివారం ఉత్తర్వులు అందజేశారు.

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి

పాల్వంచ: రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని తెలంగాణా రజక సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూపెల్లి దుర్గాప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం పాల్వంచలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలోని 18 రాష్ట్రాల్లో రజకులు ఎస్సీ జాబితాలో కొనసాగుతున్నట్లు చెప్పారు. ప్రభుత్వ గురుకుల వసతి గృహాలు, క్రీడా హాస్టళ్లు, ప్రభుత్వ సంస్థల్లో దోబీ సేవలు రజకులకే కేటాయించాలని కోరారు. వెంకట్, కుక్కునూరి వెంకటేశ్, పడిగల శ్రీనివాసరావు, రమేశ్, నరేంద్ర కుమార్, శివ, రామకృష్ణ, పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై గుంతలు పూడ్చించిన పోలీసులు

పాల్వంచ: పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో ఆర్‌అండ్‌బీ రోడ్డు గుంతలమయంగా మారింది. ఇటీవల వర్షాలకు గుంతల్లో నీళ్లు నిలిచి ప్రమాదాలకు నిలయంగా మారింది. శనివారం సాయంత్రం కూడా పలువురు గుంతల్లో పడినట్లు సీఐ వినయ్ కుమార్ దృష్టికి వచ్చింది. వెంటనే స్పందించి ఆదివారం ప్రత్యేక చొరవ తీసుకుని తారు పోయించి గుంతలు పూడ్చించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్‌ఐ నాగభిక్షం తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీ బరిలో ఉంటాం..

ఇల్లెందు: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ పోటీలో నిలుస్తుందని పార్టీ ఇల్లెందు నియోజకవర్గ కన్వీనర్ ముద్రగడ వంశీ, పార్లమెంట్ కన్వీనర్ కొండపల్లి రాంచందర్‌రావు తెలిపారు. ఆదివారం ఇల్లెందులో జరిగిన సమావేశంలో పట్టణ నూతన కమిటీతో ప్రమాణం చేయించారు. మాట్లాడుతూ.. టీడీపీ బలోపేతం లక్ష్యంగా రాష్ట్ర అధ్యక్షుడు కాసానీ జ్ఞానేశ్వర్ కృషి చేస్తున్నారని, గ్రామస్థాయి నుంచి కమిటీల నిర్మాణం పూర్తి చేసి ఎన్నికల నాటికి పార్టీని బలోపేతం చేయాలన్నారు. పట్టణ నూతన అధ్యక్ష, కార్యదర్శులు పాలమూలు బాలకృష్ణ, ఉప్పనూతల రాజేందర్ గౌడ్, నాగరాజు, నూక వెంకటేశ్వర్లు, మామిడాల భాస్కర్, గోపాలపురం సురేష్, గోరంట్ల రామయ్య, పసుపులేటి సత్యనారాయణ, గౌరిశెట్టి పురుషోత్తం, చాందావత్ రమేష్‌బాబు, కారు నర్సయ్య పాల్గొన్నారు.

గిరిజనేతరుల ఆందోళనలు చట్టవిరుద్ధం



మాట్లాడుతున్న ఈసం నర్సింహారావు

ఇల్లెందురూరల్: వందల ఏళ్ల ఉద్యమాలు, వేల సంఖ్యలో అమరుల త్యాగ ఫలితంగా సాధించుకున్న ఆదివాసీ చట్టాలను సవరించాలన్న డిమాండ్‌తో గిరిజనేతరులు చేస్తున్న ఉద్యమంలో అర్థం లేదని ఆదివాసీ సంఘాల జేఏసీ కన్వీనర్ ఈసం నర్సింహారావు అన్నారు. ఇల్లెందు మార్కెట్ యార్డ్‌లో ఆదివాసీ సంఘాల ప్రతినిధులు, పలు గ్రామాలకు చెందిన దొర, పటేల్‌లు, ఆదివాసీ ప్రజాప్రతినిధులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 5వ షెడ్యూల్డ్ ప్రాంతం పూర్తిగా గిరిజనులు నివసించే ప్రాంతమని, ఇక్కడి వనరులన్నీ గిరిజనులకే చెందుతాయన్నారు. ఈ మేరకు భారత పార్లమెంటు చట్టం కూడా చేసిందన్నారు. కానీ నేడు కొందరు రాజకీయ ప్రయోజనాలను ఆశించి గిరిజనేతరుల హక్కుల పేరిట ఉద్యమం చేస్తున్నారని ఆరోపించారు. ఇలాంటివారితో గిరిజన చట్టాలకు ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఒక రాజకీయ పార్టీ నీడలో పదవులను అనుభవిస్తూ ఏజెన్సీలో అలజడి సృష్టించే కుట్రలకు తెరలేపుతున్న ఇలాంటి వారిపై సంబంధిత పార్టీ క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆదివాసీ నాయకులు రమణాల లక్ష్మయ్య, పూనెం శ్రీనివాస్, చింత ఉపేందర్, వట్టం కన్నయ్య, సూర్నపాక సత్యనారాయణ, ముక్తి రాజు, ముక్తి కృష్ణ, ఈసం కృష్ణ, ఈసాల సురేష్, ఆరెం పాపారావు, పూనెం సారయ్య, ఈసం రాంబాబు, సర్పంచ్‌లు, దొర, పటేల్‌లు పాల్గొన్నారు.

ఇల్లెందు: రాజ్యాంగం కల్పించిన చట్టాలు, హక్కులకు వ్యతిరేకంగా గిరిజనేతర రాజకీయ నాయకులు విసిరిన వలలో చిక్కి గిరిజనులకు వ్యతిరేకంగా ఆందోళనలు చేయడం చట్టవిరుద్ధమని హైకోర్టు న్యాయవాది, కాంగ్రెస్ నాయకుడు భూక్యా మంగీలాల్ నాయక్ అన్నారు. ఆదివారం ఇల్లెందులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 1950లో 5వ షెడ్యూల్డ్ ఏర్పాటు అయిందని, 1959లో ఎల్‌టీఆర్ చట్టం వచ్చిందన్నారు. 1963లో, 1969లో కొన్ని సవరణలు చేశారని, 1970లో 1/70 చట్టం తెచ్చినట్లు తెలిపారు. ట్రైబల్ అడ్వయిజరీ కమిటీ సూచన మేరకు 2/3వ వంతు మెజార్టీలో రాష్ట్రపతికి మాత్రమే చట్టాలను మార్పు చేసే అవకాశం ఉంటుందని, రాజకీయ దురుద్దేశ్యంతో కొంతమంది నాయకులు విసిరిన వలలో చిక్కి పోరాటాలు చేయటం వల్ల ఉపయోగం ఉండదన్నారు. 1/70 చట్టం ప్రకారం ఏజెన్సీలో గిరిజనేతరులకు హక్కులు లేవన్నారు. కొంతమంది స్వార్థపరులు రెచ్చగొట్టి ఆందోళనలు చేయిస్తున్నట్లు పేర్కొన్నారు. గిరిజనేతరులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రశాంతంగా జీవించేందుకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని తెలిపారు.

గిరిజనేతరులు ఐక్యం కావాలి



టేకులపల్లిలో సమావేశమైన గిరిజనేతరులు

టేకులపల్లి: ఏజెన్సీలో బీసీ, ఎస్సీ, ఓసీ, మైనారిటీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం, హక్కుల సాధన కోసం గిరిజనేతరులు ఐక్యంగా రావాలని పీఏసీఎస్ చైర్మన్, డీసీసీబీ డైరెక్టర్ లక్కినేని సురేందర్‌రావు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం మండల కేంద్రంలో గిరిజనేతరుల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈనెల 22న ర్యాలీగా వెళ్లి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసి మార్కెట్ యార్డులో సభ ఏర్పాటు చేసుకోవాలని తీర్మానించారు. పేద గిరిజనేతరులకు పోడు భూమి పట్టాలు, కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు, ఇతర సమస్యలు, హక్కుల సాధన కోసం 22న జరిగే సమావేశంలో చర్చించడం జరుగుతుందని తెలిపారు. ధర్మపురి వీరబ్రహ్మేంద్రచారి, గుడిపూడి మోహన్‌రావుల అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఉండేటి ప్రసాద్, ఉల్లోజు ఉదయ్, ఈసాల ఆదాం హనీఫ్, గుడిపూడి మోహన్‌రావు, గుడిపూడి సత్యనారాయణ, లక్కినేని వెంకటేశ్వరరావు, నర్సింగ్ లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని బలోపేతం చేద్దాం..



సహపంక్తి భోజనాలు చేస్తున్న నాయకులు

ఇల్లెందు: బీజేపీ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు ఆదివారం ఇల్లెందులో 'టిఫిన్ బాక్స్ బైఠక్'నిర్వహించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు కొల్లి సంజీవరెడ్డి ఆధ్వర్యంలో పట్టణ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. నాయకులు, కార్యకర్తలు ఎవరికి వారే లంచ్ బాక్స్‌లు తెచ్చుకుని సహపంక్తి భోజనాలు చేశారు. ఈ సందర్భంగా సంజీవరెడ్డి మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి తీసుకొచ్చేందుకు బీజేపీ శ్రేణులు అహర్నిషలు కృషి చేయాలని కోరారు. జాతీయ నాయకత్వం పట్టుదలతో ఉందని అదే ఒరవడితో శ్రేణులు పోరాడాలని పేర్కొన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలో ప్రజా సంక్షేమ పథకాలు అమలులో ఉన్నాయని, వాటిని ఇంటింటికి ప్రచారం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మావునూరి మాధవ్, మిర్యాల వెంకటేశ్వర్లు, శాసనాల రామయ్య, దోమల మహేశ్వర్, రేవళ్ల నాగరాజు, శ్రీనివాస్, దన్ను, శివకుమార్ ఖండేల్‌వాల్, బోడ సురేందర్, రాహుల్, మహదేవ్, వంశీధర్ గౌడ్, సందీప్‌నాయుడు, రవిలోథ్, నరసింహారెడ్డి, డాక్టర్ రాంచందర్ పాల్గొన్నారు.

బాల్య మిత్రుడికి ఆర్థిక సాయం



రాధాకృష్ణకు నగదు అందజేస్తున్న స్నేహితులు

జూలూరుపాడు: అనారోగ్యంతో బాధపడుతున్న అనంతారం గ్రామానికి చెందిన పూనెం రాధాకృష్ణకు బాల్యమిత్రులు ఆర్థిక సాయం అందజేసి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. ఆదివారం అతని ఇంటికి వెళ్లి పరామర్శించి, రూ.20 వేల నగదు అందజేసి ధైర్యం చెప్పారు.

కార్యక్రమంలో రాచబంటి వెంకటనర్సయ్య, చావా మురళీ, ఆనంగి వెంకటేశ్వర్లు, సున్నం కరుణాకర్, శ్రీదేవి, కవిత, రామస్వామి, బండారి శ్రీను, వెంకటప్పయ్య, దొడ్డా పిచ్చయ్య, కృష్ణయ్య, ఏపూరి నాగేశ్వరరావు, నరసింహారావు, మంగీలాల్ తదితరులు పాల్గొన్నారు.

కేటీసీలో బురద, గుంతలు



కేటీసీలో విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలో అధ్వానంగా ఉన్న రోడ్డు

టేకులపల్లి: కోయగూడెం ఓపెన్‌కాస్టులో రహదారులు బురద, గుంతలమయంగా మారాయి. కేటీసీ నుంచి లక్షల టన్నుల్లో బొగ్గు రవాణా చేస్తూ రూ.కోట్లు ఆదాయం వస్తున్నా సింగరేణి రహదారుల రక్షణపై పట్టింపు లేకపోవడం శోచనీయం. ప్రీవేబిన్ దారి, విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలో క్యాంపుకు వెళ్లేదారిలో బురద, గుంతల కారణంగా డ్రైవర్లు అవస్థలు పడుతున్నారు. బొగ్గు, ఓబీ తీసుకెళ్తున్న సమయంలో పెల్లలు కింద పడే ప్రమాదం ఉంది. క్వారీలోకి వెళ్లే కొన్ని దారులు కూడా బురదతో జారుతున్న పరిస్థితి నెలకొంది. చెక్‌పోస్టు వద్ద కూడా బురదతో అధ్వానంగా ఉంది. ప్రమాదాలు జరగకముందే అధికారులు స్పందించి కేటీసీలోని రహదారులన్నింటికీ మరమ్మతులు చేపట్టాలని కార్మికులు కోరుతున్నారు. ఈ విషయమై వివరణ కోసం కేటీసీ ప్రాజెక్టు ఆఫీసర్‌ని ఫోన్‌లో సంప్రదించగా స్పందించ లేదు.

అటెన్షన్ ప్లీజ్



వంతెన నిర్మాణం ఎప్పుడయ్యేనో..?



సుజాతనగర్, సీతంపేట గ్రామాల మధ్య ఎదుళ్లవాగుపై నిర్మించిన వంతెన నిర్మాణం పూర్తి కాకపోవడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఏడాది గడుస్తున్నా ఇంకా పూర్తి కాలేదు. పెద్దవర్షం వచ్చినప్పుడు నీరు ఉధ్రుతంగా ప్రవహించి పలు గ్రామాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. త్వరితగతిన నిర్మాణం పూర్తి చేసి వంతెనను అందుబాటులోకి తేవాలని పలువురు కోరుతున్నారు.

– సుజాతనగర్

ప్రశ్నించాల్సిన అధికారి : సత్యనారాయణ,
పంచాయతీ రాజ్ డీఈ
ఫోన్ నెంబర్: 9866722779

ఘనంగా అమ్మవారికి బోనాలు



కొత్తగూడెం బూడిదగడ్డబస్తీలోని మహంకాళి అమ్మవారి బోనాల జాతరలో ఎమ్మెల్యే వనమా

కొత్తగూడెంటౌన్: అషాఢమాసం సందర్భంగా కొత్తగూడెం మున్సిపాలిటీ 1వ వార్డు పరిధిలోని బూడిదగడ్డ బస్తీలో ఉన్న శ్రీశ్రీశ్రీ మహంకాళీ అమ్మవారి ఆలయంలో అర్చకులు భవాని స్వామి ఆధ్వర్యంలో బోనాల జాతర పండగ ఘనంగా నిర్వహించారు. అదివారం ఆలయం భక్తులతో కిటకిటలాడింది. భక్తులు బోనాలతో కాళీకామాత అమ్మవారు, పోతురాజు వేషధారణలతో ఆలయానికి ఊరేగింపుగా చేరుకున్నారు. జాతరను కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు ఊరేగింపు రథాన్ని లాగి ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు. కొత్తగూడెం మాజీ వైస్ చైర్మన్ ఎస్‌కే సాబీర్‌పాషా అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయన వెంట వార్డు కౌన్సిలర్లు బోయిన విజయ్‌కుమార్, పి.సత్యనారాయణచారి, పల్నాంటి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

జూలూరుపాడు: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకైన బోనాల పండుగను పాపకొల్లు గ్రామ ప్రజలు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. శ్రీకోటమైసమ్మతల్లికి బోనాలను సమర్పించేందుకు స్థానికులతోపాటు, పరిసర గ్రామాలైన రాజారావుపేట, జడలచింత, మహిళలు, యువతులు, పిల్లలు పెద్ద ఎత్తున తరలి రావడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో నిండిపోయింది. ప్రజలు తల్లికి భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.



కొత్తగూడెంటౌన్: జాతరలో వివిధ వేషధారణలు



సింగరేణి(కొత్తగూడెం): మహంకాళీ అమ్మవారి ఆలయంలో మాట్లాడుతున్న సాబీర్‌పాషా



జూలూరుపాడు: శ్రీకోటమైసమ్మ తల్లి ఆలయానికి బోనాలతో వస్తున్న భక్తులు